శుభప్రదం శ్రావణమాసం

- నేటి నుంచి ప్రారంభం
- నెల రోజులపాటు భక్తిశ్రద్ధలతో కొనసాగనున్న పూజలు, వ్రతాలు
- ముస్తాబైన ఆలయాలు

షాబాద్/బొంరాస్‌పేట, ఆగస్టు 4: హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసానికి ప్రత్యేక స్థానం ఉన్నది. ఈ మాసం శ్రీమహా విష్ణువుకు ఎంతో ప్రీతికరమైనది. హిందువులు ఈ నెలను పవిత్రమైనదిగా.. ఉపవాసాలు, పండుగల మాసంగా భావిస్తారు. ఈ నెలలో రోజూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. వివాహాది శుభకార్యాలకు అనువైనది. నేటి నుంచి వచ్చే నెల 3 వరకు శ్రావణమాసం కొనసాగుతుంది. నెల రోజులపాటు లక్ష్మీదేవికి పూజలతోపాటు మహిళలు వ్రతాలు ఆచరిస్తారు. వివాహాలు, గృహప్రవేశాలు, నిశ్చితార్థాలు, శంకుస్థాపనలు, కొత్త వ్యాపారాలను ప్రారంభించడం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం, విగ్రహాల ప్రతిష్ఠాపన వంటి శుభకార్యాలను ఈ నెలలో నిర్వహిస్తారు. ఈ మాసంలో భక్తులు శివారాధనకు అధిక ప్రాధాన్యమిస్తారు. నేటి నుంచే ఈ మాసం ప్రారంభం అవుతుండడంతో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ప్రజలు తమ ఇండ్లను శుభ్రం చేసుకుని వ్రతాలు, పూజలకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది శ్రావణమాసంలో సోమ, శని, శుక్రవారాలు నాలుగేసి చొప్పున రావడం విశేషం. అందులోనూ సోమవారం నుంచే శ్రావణమాసం ప్రారంభం కానుండడం మరో ప్రత్యేకత. ఈ నెలల వచ్చే పండుగలు వాటి ప్రాధాన్యాన్ని తెలుసుకుందాం.

8న నాగుల చవితి..

శ్రావణమాసంలో వచ్చే మొదటి పండుగ నాగుల చవితి. మహిళలు ఈ రోజు ఉపవాస దీక్షలు చేపట్టి పుట్టలో నాగదేవతకు, నాగుల విగ్రహాలకు పూజలు చేసి పాలు పోస్తారు. మరుసటి రోజు నాగుల పంచమి రోజున పూజలు చేసి ఉపవాస దీక్షలు విరమిస్తారు. నాగ దేవతలను పూజించడంవల్ల కుజ, నాగ దోషాలు తొలగిపోతాయని వారి విశ్వాసం.

26న శ్రీకృష్ణ జన్మాష్టమి

శ్రావణమాసంలో కృష్ణ పక్షంలో వచ్చే అష్టమి రోజును శ్రీకృష్ణ జన్మాష్టమిగా జరుపుకొంటారు. ఈ నెల 26న శ్రీకృష్ణ జన్మాష్టమిని జరుపుకోనున్నారు. ఈ రోజు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి కృష్ణుడికి డోలారోహణం నిర్వహిస్తారు. మరుసటి రోజు పెరుగు బసంతం, ఉట్టికొట్టే ఉత్సవాలను నిర్వహిస్తారు.

మంగళ గౌరీ వ్రతాలు

శ్రావణమాసంలో వచ్చే ప్రతి మంగళవారానికీ ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. ఈ మాసంలోని ప్రతి మంగళవారం నాడు మంగళగౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. కొత్తగా వివాహమైన మహిళలు మొదటి ఐదేండ్లపాటు ఈ వ్రతాన్ని ఆచరించాలని పండితులు చెబుతుంటారు. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల వైవాహిక జీవితంలో సుఖసంతోషాలు నెలకొంటాయని నమ్మకం.

16న వరలక్ష్మీ వ్రతం

శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్ర వారం నాడు వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకొంటారు. ఈ నెల 16న వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ వ్రతాన్ని ఆచరించడం ద్వారా ఆదాయం, సంతోషం, ఐశ్వర్యం పెరుగుతుందని..సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం.

19న రాఖీ పౌర్ణమి

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచేది రాఖీ పౌర్ణమి. ఈ నెల 19న ఈ పండుగ వస్తున్నది. ఈ పవిత్రమైన రోజున మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి ఆశీర్వదిస్తారు. సోదరులు ఇచ్చే కానుకలు స్వీకరిస్తారు.

ఉపవాస దీక్షలు..పూజలు

పైన ఉన్న పండుగలతోపాటు శ్రావణమాసంలో వచ్చే ప్రతి సోమ, శనివారాలను పవిత్రమైన రోజులుగా భక్తులు భావిస్తారు. సోమవారాల్లో శివుడిని, శనివారాల్లో వెంకటేశ్వరుడు, ఆంజనేయస్వామిని ఆరాధిస్తారు. ఉపవాస దీక్షలు చేపట్టి పూజలు చేస్తారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో ప్రజలు నరసింహస్వామిని ఇంటి దేవునిగా పూజిస్తారు. అందువల్లే శ్రావణమాసంలోని మూడో, చివరి సోమవారాల్లో యాదగిరిగుట్ట, కర్ణాట కలోని బీదర్‌లో కొలువుదీరిన నరసింహస్వామిని దర్శించుకోవడానికి వెళ్తుంటారు. జిల్లాలోని బషీరాబాద్ మండలంలోని ఏకాంబరేశ్వరాలయంతోపాటు బొంరాస్‌పేట మండలంలోని మామిడికుంట ఆంజనేయస్వామి ఆలయం.. ఇతర మండలాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

సెల్ఫీలు దిగుతూ..

- అధిక సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులు
- కిటకిటలాడిన అనంతగిరి కొండలు

వికారాబాద్ సమీపంలోని అనంతగిరి కొండలు పర్యాటకులతో కిటకిటలాడాయి. ఆదివారం హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్ తదితర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తర లివచ్చారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. స్నేహితులు ఒకచోట చేరి చిన్ననాటి విషయాలను స్మరించుకున్నారు. అనంతగి రి కొండల్లో సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. పచ్చని అందాలను ఆస్వాదించారు. అంతకుముందు అనంతగిరి అనంతపద్మనాభ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. **-వికారాబాద్, ఆగస్టు 4**

సెల్ఫీలు దిగుతున్న పర్యాటకులు

జెండా ఊపి రన్/రైడ్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖులు

స్పైనల్ మస్కులర్ ఆట్రోఫీపై అవగాహన రన్

కొండాపూర్, ఆగస్టు 4: స్పైనల్ మస్కులర్ ఆట్రోఫీపై అవగాహన పెంచేందుకు ఆదివారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వద్ద క్యూర్ ఎస్ఎమ్ఏ ఇండియా స్వచ్ఛంద సంస్థ 'రన్/రైడ్ ఫర్ ఎస్ఎమ్ఏ' పేరిట 5కే, 10కే అవగాహన రన్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జోనల్ ఆఫీస్ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ ఏ.రాంకిషన్ ముఖ్య అతిథిగా హాజరై రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సీనియర్ పీడియాట్రిషియన్ కన్సల్టెంట్ డాక్టర్ రాధాదేవి, ఫార్మాస్యూటికల్, బయోటెక్, క్లినికల్ రీసెర్చ్ సంస్థల సలహాదారు మారుతి సాయి, అర్చన సురేష్, ఏవీకే మోహన్‌లతో కలిసి జెండా ఊపి బైస్కిల్ రైడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వెన్నెముక కండరాల క్షీణత వంటి అరుదైన పరిస్థితులను పరిష్కరించడంలో ఫార్మాస్యూటికల్ కంపెనీలు సహకరించాలన్నారు. స్పైనల్ మస్కులర్ ఆట్రోఫీపై ప్రజల్లో తగిన అవగాహన కల్పించేందుకు ఈ రన్/రైడ్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ల విస్తరణ

- నిరంతరం విద్యుత్ సరఫరా చేసే వ్యవస్థకు కార్యాచరణ
- 10 సర్కిళ్లలో 213 ఎఫ్ఓసీలు
- క్షేత్ర స్థాయిలో సత్వర పరిష్కారమే ఏకైక లక్ష్యం

సిటీబ్యూరో, ఆగస్టు 4(నమస్తే తెలంగాణ): అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. క్షేత్ర స్థాయిలో తలెత్తే విద్యుత్ అంతరయాలను సత్వరమే పరిష్కరించే ఫ్యూజ్ ఆఫ్ కాల్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. గ్రేటర్ పరిధిలో ఉన్న మొత్తం 10 సర్కిళ్ల లోని ప్రతి సెక్షన్‌కు ఒక ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ ఉండేలా ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిన వెంటనే సత్వర మరమతులకు చేపట్టేందుకు ఏర్పాటు చేసిన ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్ఓసీ) వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. విద్యుత్ సరఫరాలో వచ్చే ఫిర్యాదులను అతి తక్కువ కాలంలో పరిష్కరించేందుకు ఇప్పటి వరకు 213 ఎఫ్ఓసీలను ఏర్పాటు చేశారు. ప్రతి ఎఫ్ఓసీ ఒక వాహనాన్ని (ఆటో రిక్షా) అందులో ఇద్దరు చొప్పున ఎలక్ట్రికల్ నిపుణులు ఉంచి, మరమ్మతు చేయిస్తున్నారు. వీటి పనితీరు మెరుగ్గా ఉండేందుకు ఆయా ఆటోరిక్షాల్లో జీపీఎస్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ కంట్రోల్ రూమ్ నుంచే పర్యవేక్షణ చేసే వ్యవస్థను రూపొందించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో 1912 కాల్ సెంటర్, ఎఫ్ఓసీల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారంలో అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నారు. విద్యుత్ కంట్రోల్ రూమ్‌లో 74 మంది సుశిక్షత ఆపరేటర్లు 24/7 అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దడం జరిగిందని, ఈ అధునాతన కాల్ సెంటర్ ద్వారా ఒకేసారి 400 కాల్స్‌ను అందుకునే సామర్థ్యం ఉందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

పల్లెల్లో స్వచ్ఛదనం-పచ్చదనం

నేటి నుంచి 9వ తేదీ వరకు గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు

- ఒక్కో రోజు ఒక్కో ప్రోగ్రాం చేపట్టనున్న అధికారులు
- రంగారెడ్డి జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల్లో కొనసాగనున్న కార్యక్రమాలు
- పారిశుధ్య కార్యక్రమాలతోపాటు వనమహోత్సంలో మొక్కలు నాటడం
- అందరి భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని సక్సెస్ చేసేలా అధికారుల చర్యలు

షాబాద్, ఆగస్టు 4 : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించి రాష్ట్రంలోని ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగుపర్చేందుకు నేటి నుంచి ఈనెల 9వ తేదీ వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రోగ్రామ్‌ను సక్సెస్ చేసేందుకు గ్రామాలు, పట్టణ ప్రాంతాలను రోజువారీగా క్రమపద్ధతిలో శుభ్రపర్చేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. రంగారెడ్డిజిల్లా వ్యాప్తంగా 558 గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి ఐదు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు ప్రారంభం..

మొదటి రోజు ఐదోతేదీ సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ప్రారంభం కానున్నది. స్థానిక నాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువజన, వార్డు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, ర్యాలీ నిర్వహిస్తారు. స్వయం సహాయక సంఘాల సమావేశంలో ఈ కార్యక్రమంలో చేపట్టాల్సిన అంశాలు, వీధి కుక్కలు, గృహ స్థాయిలో చెత్తను వేరు చేయడంపై దృష్టి పెట్టడం తదితర అంశాలపై చర్చించనున్నారు. ఇప్పటికే జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అన్ని గృహాల నుంచి వేరుచేసిన వ్యర్థాలను సేకరించి, కంపోస్ట్ ఎరువు తయారు చేయడం.. పారిశుధ్యం, తోటల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలల్లో ప్రసంగాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. స్వచ్ఛంద సేవకులు/వెక్టర్ వారియర్స్(అంటు వ్యాధులను నియంత్రించే సిబ్బంది)ని ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తారు. వీధులు, బహిరంగ ప్రదేశాలను శుభ్రపర్చడం, చెత్త, హాని కలిగించే ప్రదేశాలపై దృష్టి సారించి ప్రతిరోజూ ప్రాంతాల వారీగా శుభ్రపర్చనున్నారు. అన్ని ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, హాస్టళ్లు, పీహెచ్‌సీలు, బస్టాప్‌లోనూ శుభ్రం చేస్తారు. అన్ని పారిశుధ్య వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలను అమర్చి.. పట్టణ స్థానిక సంస్థల్లో స్వచ్ఛ ఆటోలను హేతుబద్ధీకరించనున్నారు. ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు వాల్ పెయింటింగ్స్ వేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఐహెచ్‌హెచ్‌ఎల్‌లు లేని గృహాలకు ఐహెచ్‌హెచ్‌ఎల్‌ల గ్రౌండింగ్, 15 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటారు.

6న తాగునీరు/వర్షపునీటి సేకరణ..

అన్ని తాగునీటి వనరులు(ఈఎల్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్)శుభ్రం చేస్తారు. ప్రతిరోజూ క్లోరినేషన్ చేస్తారు. పరీక్షా కిట్లతో క్లోరినేషన్(పీపీఎం స్థాయిలు) పరీక్షిస్తారు. అవి అందుబాటులో లేకపోతే క్లోరోస్కోప్‌లను కొనుగోలు చేస్తారు. తాగునీటి పరిస్థితిని తెలుసుకునేందుకు సుదూర ప్రాంతాలు, నివాసాలు, బలహీన వర్గాల కాలనీలను సందర్శిస్తారు. వర్షపునీటి సేకరణ నిర్మాణాల్లేని భవనాలను(300 చదరపు గజాల విస్తీర్ణం)గుర్తించి వాటిని వెంటనే రూపొందించేందుకు మార్గనిర్దేశం చేస్తారు.

7న నీరు నిలిచిపోయిన ప్రాంతాలు..

కాల్వలు, నీరు నిలిచిపోయిన ప్రాంతాలు/గుట్టలను నింపుతారు. ఓహెచ్ఎస్ఆర్‌లు, ట్యాంకులు/గొట్టపు బావుల సమీపంలో నిలిచిపోయిన నీటిని తీయడం సాధ్యంకాని ప్రదేశాల్లో డ్రైన్ చివర కమ్యూనిటీ సోక్ పిట్ల పనులు చేపట్టనున్నారు.

8న వీధి కుక్కల ముప్పుపై దృష్టి..

ఆరోగ్యం/వీధి కుక్కల ముప్పుపై దృష్టి సారిస్తారు. స్వయం సహాయక సంఘాలు, ఆశ వర్కర్లు పాఠశాలల్లో మీటింగ్‌లు ఏర్పాటు చేసి డెంగీ, మలేరియాపై ఐఈసీ ప్రచారాన్ని నిర్వహించనున్నారు. నీరు నిలిచే టీ కప్పులు, బ్లూట్లు, సీసాలు, టైర్లు, కంటైనర్లు వంటి వస్తువులను తొలగించాలని ప్రచారం చేయనున్నారు. అన్ని ప్రభుత్వ సంస్థలు-పాఠశాలలు, అంగన్‌వాడీలు, హాస్టళ్లు, పీహెచ్‌సీలు, బస్టాప్ తదితర పై కప్పులను శుభ్రం చేయనున్నారు.

వనమహోత్సవం..

వన మహోత్సవం కింద గుర్తించిన గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల్లోని అన్ని ప్రదేశాల్లో మొక్కలు నాటడం పూర్తి చేయనున్నారు. అటవీ శాఖతో సంప్రదించి అటవీ సరిహద్దు ప్రాంతాలు, అడవి జంతువులకు ఉపయోగపడే చిన్న అటవీ ఉత్పత్తి జాతుల పెంపకానికి చర్యలు చేపట్టనున్నారు. గుర్తించిన ప్రదేశాల్లో అవెన్యూ ప్లాంటేషన్‌ను పూర్తి చేయనున్నారు. బహిరంగ, లేఅవుట్ బహిరంగ ప్రదేశాలు, గ్రామ పంచాయతీ భూములు, మున్సిపల్ భూములు మొదలైన వాటిని గుర్తించి(జియో ట్యాగింగ్)ద్వారా రక్షణ కల్పించనున్నారు.

గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి, ఆశవర్కర్, గ్రామ సంస్థకు చెందిన ముగ్గురు ఆఫీస్ సిబ్బంది, ఇతర గ్రామ పంచాయతీ స్థాయి కార్యకర్తలతో కూడిన బృందాలను కలెక్టర్ ఏర్పాటు చేస్తారు.

కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తాం

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నేటి నుంచి గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహిస్తాం. సోమవారం జిల్లాలోని అన్ని గ్రామాల్లో ర్యాలీలు తీసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. రోజువారీగా కార్యక్రమాలను చేపట్టనున్నాం. ఈ ఐదు రోజులే కాకుండా గ్రామాల్లో ప్రతిరోజూ పరిశుభ్రత కార్యక్రమాలతోపాటు మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నాం. అందరి భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని సక్సెస్ చేస్తాం

- సురేశ్‌మోహన్, రంగారెడ్డిజిల్లా పంచాయతీ అధికారి

రూ.24,042 కోట్లు..78.4 కి.మీలు

మెట్రో 2.0 కోసం కారిడార్ల వారీగా డీపీఆర్‌లు

- 'ఎయిర్‌పోర్టు' కారిడార్‌కు రూ.8500 కోట్లు
- 'పాతబస్తీ'కి రూ.2300 కోట్ల అంచనా
- 2029 నాటికి పూర్తి చేసేలా డీపీఆర్‌ల రూపకల్పన
- ఆగస్టు 15 నాటికి ప్రభుత్వం ముందుకు

సిటీబ్యూరో, ఆగస్టు 4(నమస్తే తెలంగాణ): మెట్రో రైలు రెండో దశ సమగ్ర ప్రాజెక్టు నివేదికల రూపకల్పన కొలిక్కి వచ్చింది. మొదటి దశను అనుసంధానం చేస్తూ నగరంలో మొత్తం 78.4 కి.మీ మేర విస్తరించేలా 5 కారిడార్లను నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు అనుగుణంగా ప్రైవేట్ కన్సల్టెన్సీ సంస్థ సిస్ట్రాకు డీపీఆర్ రూపకల్పన బాధ్యతలను ఇవ్వడంతో ఆ సంస్థ ప్రతినిధులు బేగంపేటలోని మెట్రో రైలు భవన్ కేంద్రంగానే పనిచేస్తున్నారు. డీపీఆర్‌కు తుది రూపం ఇస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగిం చుకొని వచ్చే నాటికి డీపీఆర్‌ను ప్రభుత్వం ముందుంచాలని హైదరాబాద్ మెట్రో అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో ప్రతిపాదించిన 5 మెట్రో కారిడార్లకు వేర్వేరుగా డీపీఆర్‌లను సిద్ధం చేశారు. మొదటి దశలో పెండింగ్‌లో ఉన్న పాతబస్తీ మెట్రో మార్గాన్ని చాంద్రాయణగుట్ట వరకు పొడిగిస్తూ దానికి ప్రత్యేకంగా డీపీఆర్ సిద్ధం చేయగా, మిగతా 5 కారిడార్లకు డీపీఆర్‌లను ఆగస్టు 15 నాటికి రాష్ట్ర ప్రభుత్వం ముందుంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 5 మెట్రో కారిడార్లకు వేర్వేరుగా డీపీఆర్‌లు సిద్ధం చేసి టెండర్లు పిలిచి వేర్వేరు నిర్మాణ సంస్థలకు పనులు అప్పగించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. మొత్తం ఒకే సంస్థకు ఇవ్వకుండా 5 కారిడార్లను వేర్వేరు సంస్థలకు ఇవ్వడం ద్వారా ఒకే సమయంలో అన్ని కారిడార్ల పనులు ఆయా నిర్మాణ సంస్థలు చేపట్టేలా చర్యలు తీసుకోనున్నారు.

పాతనగరం మెట్రోకే రూ.2300 కోట్ల అంచనా..

పాతనగరంలో మెట్రో మార్గాన్ని నిర్మించే రోడ్డు విస్తీర్ణం చాలా తక్కువగా ఉంది. ఆ మార్గాన్ని 60 నుంచి 80 అడుగుల మేర విస్తరించాలంటే ఆస్తుల సేకరణ ఎక్కువ మొత్తంలో చేయాలి. ఈ మార్గంలో విద్యుత్ స్తంభాలు, మంచినీటి లైన్లు, డ్రైనేజీ లైన్స్, కేబుల్స్‌ను మరో చోటుకు తరలించాల్సి ఉంటుందని, సుమారు రూ.200 కోట్లు వ్యయం అవుతుందని మెట్రో అధికారి తెలిపారు. మతపరమైన కట్టడాలు సైతం 100కు పైగా ఉండడంతో వీటికి ఎలాంటి ఆటంకం కలుగకుండా నిర్మాణాలు చేపట్టాలంటే.. చాలా సమయం తీసుకుంటుంది. 7.5 కి.మీ మెట్రో కారిడార్‌లో భారీ ఎత్తున ఆస్తులను సేకరించాల్సి వస్తోందని అధికారులు చెప్పారు. ప్రతిపాదిత మెట్రో మార్గంలో సుమారు 1100లకు పైగా ఆస్తులు ఉన్నాయని, వాటన్నింటినీ పరిహారాన్ని చెల్లించాలంటే మొత్తం ప్రాజెక్టు వ్యయంలో సగం ఆస్తుల సేకరణకే వెచ్చించాల్సి ఉంటుందన్నారు. ఈ లెక్కన పాతనగరం మెట్రోకే రూ.2300 కోట్ల దాకా ఖర్చు చేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచే 50% నిధులు..

మొదటి దశ మెట్రోను పూర్తిగా పీపీపీ విధానంలో నిర్మిస్తే, రెండో దశను పూర్తిగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే నిధులను సమకూర్చనున్నాయి. మొత్తం వ్యయంతో కేంద్ర ప్రభుత్వం 15శాతం, రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం భరిస్తే, మిగతా 50 శాతంలో 45 శాతం రుణాల ద్వారా, మరో 5 శాతం వ్యయాన్ని పీపీపీ విధానంలో సమకూర్చుకునేలా రెండో దశ మెట్రో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2029 నాటికి రెండో దశను పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రాజెక్టు డిజైన్‌తో పాటు నిధులను సమకూర్చుకునే ప్రణాళికను డీపీఆర్‌తో పాటు ప్రభుత్వానికి అందజేయనున్నారు. మొత్తం 5 కారిడార్లలో నిర్మించే మెట్రో రెండో దశకు కారిడార్ల వారీగా వ్యయాన్ని అంచనా వేస్తూ డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు సుమారు 31 కి.మీ మెట్రోకు రూ.8500 కోట్ల దాకా వ్యయం అవుతుంది. ఎయిర్‌పోర్టు కారిడార్ నిర్మాణంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్టు సంస్థ సైతం భాగస్వామిగా ఉండనున్నది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రాయదుర్గం నుంచి ఓఆర్ఆర్ వెంబడి ప్రతిపాదించిన మెట్రో మార్గంలో నిర్మాణానికి ఆ సంస్థ సుమారు రూ. 625 కోట్ల వరకు వెచ్చించేందుకు ముందుకు వచ్చింది. ఇలా ఒక్కో కారిడార్‌ను వేర్వేరుగా నిర్మించేందుకు వీలుగా డీపీఆర్‌లను రెడీ చేస్తున్నారు.

మనూలో జష్న్ -ఏ-ఆదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్‌లో కళాకారుల సందడి

మనూలో జష్న్-ఏ-ఆదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్

కొండాపూర్, ఆగస్టు 4: గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ)లో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ (జీఓఐ), పర్యాటక మంత్రిత్వ శాఖల సహకారంతో ఏర్పాటు చేసిన సాహిత్యోత్సవ్ జష్న్ -ఏ- ఆదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్ సందడిగా సాగింది. మనూ వీసీ ప్రొఫెసర్ ఐనుల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖులు పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ అశోక్‌చక్రధర్, ఓటీటీ నటులు అమిత్ సియాల్, పైసల్ మాలిక్, మానురిషి చద్దా, జాతీయ అవార్డు గ్రహీత, కూచిపూడి నృత్యకారిణి యామినీరెడ్డి, అనేక మంది నిష్ణాతులైన కళాకారులు ఒకే వేదికపై మెరిసి సందడి చేశారు. కార్యక్రమంలో ప్రఖ్యాత శాస్త్రవేత్త, ప్రొఫెసర్ సయ్యద్ ఈ హస్నైన్, తెలంగాణ కస్టమ్స్, జీఎస్టీ ప్రధాన కమిషనర్ సందీప్ ప్రకాశ్, మధుమిత తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని డిగ్రీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

పీజీ డిప్లామా ఇన్ కలినరీ ఆర్ట్స్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లామా ఇన్ కలినరీ ఆర్ట్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 7 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.